UNIVERSAL
LIBRARY
OU_204571
UNIVERSAL
LIBRARY

# కపోతీకపోతము

[పద్యకావ్యము]

కావ్యకర్త:

జోస్యుల రాజారామమోహనరావు

ఆంధ్రప్రచారిణీప్రెస్సున
ముద్రితము.
1949

సర్వస్వామ్య
సంకలితము.

మూల్యము
రు. ౦—౮—౦

# పీఠిక.

శ్రీమదాంధ్రసారస్వతము నిరుపమాన మైనది. ఆంధ్ర కవిపుంగవుల యాధ్యాత్మికమనస్తత్త్వము, ఆర్ష సంస్కృతి యవగాహన చేసికొనుటకు ముందు మనలో నాధ్యాత్మికశక్తి, ఆర్ష సంస్కృతిపై నమితాభిమానము వలయును. 'నానృషిః కురుతే కావ్య' మ్మనియు "ఋషిః కవిః" అనియుఁ గల యార్షవాక్యము లాంధ్రకవిశేఖరుల కత్యధికముగా ననువర్తించు ననుట సత్యమునకు సన్నిహితవార్త. పై రెండు గుణములు కలిగియుండుటచేతనే మనప్రాచీనాంధ్రకవుల కావ్యరాజములు శాశ్వతత్త్వము నందఁగన్నవి. ఇతివృత్తసంగ్రహణముననే మనకవితల్లజుల ప్రతిభా ప్రభావములు ద్యోతకము లగుచుండును. భారతకల్పకము నాశ్రయించి యజరామరత్వ మందఁగన్నవారు కొందఱు; భాగవతకామధేనువు నాశ్రయించి పరమేశ్వరసాయుజ్యము నందఁగన్నవారు మఱికొందఱు; పురాణసుధ నాశ్రయించి పురుషాయుషమునఁ బుణ్యకీర్తను లైనవారు మఱి యెందఱో. కాంతాసమ్మితత్త్వమున శృంగారకథావ్యాజమున నైహికాముష్మిక పరమార్థములఁ జూఱఁగొని యాంధ్రమహాజనులకుఁ జూఱయిచ్చినమహామహులు లెక్కకు మిక్కిలియైనవారు. పరమపవిత్రమగు కావ్యామృతమునఁ బరమేశ్వరచరణసేవ యొనర్చిన యుద్దండులే మనప్రాచీనాంధ్ర కవులు.

ఈపరమ రహస్యమును గుర్తింపలేనియధునాతనులు క్షణికజీవితములను విస్మరించి యాత్మానాత్మవిచక్షణముకాని యనశ్వర వినశ్వరతలఁ గాని గుర్తింపలేని యవివేకులగుటఁ గప్పలపై గబ్బిలములపైఁ దూనీఁగలపై నెఱ్ఱలపైఁ గావ్యాభాసముల రచించి యపూర్వకవుల మని విఱ్ఱవీఁగుటలు "పుట్టలోనిచెదలు పుట్ట

వా గిట్టవా" యనువేమన సూక్తికి నిదర్శనము లగుటేకాని యన్యము కాదు. కవిత్వతత్త్వము కాని కళాతత్త్వము కాని యెఱుఁగుట యనఁగా నేతత్సాధనములమూలమున నాత్మతత్త్వ మెఱిఁగి యాముష్మికసుఖము నందఁగనుటే. కళ కళకొఱకే యనుతుచ్ఛవాదములకు భారతదేశమునఁ దావే లేదు. కళ యీశ్వరుని కొఱకు. కవిత యీశ్వరప్రియమునకు, గాన మీశ్వర సంస్తుతికి. మానవుని జీవితమే యీశ్వరప్రీతికి. ఇదియే యార్ష సాంప్రదాయము.

కావున, సత్త్వమోత్తమాదర్శజీవనమునఁగాని మానవునకు ఋషిత్వమందుట సాధ్యము కాదు. ఋషియైననే కాని ధర్మోపదేశమున కర్హత లేదు. అందుచే ముందు ఋషియై యీశ్వరకృపఁగవియై యాత్మజీవితసార్థక్యమునకుఁదోడిమానవుల నజ్ఞానదశనుండి విజ్ఞానదశకు లేవనెత్తుటకు బహువిధప్రవర్తితమగు నీశ్వరవిభూతిని యథాశక్తి నభివర్ణించుచుఁ బరమేశ్వర ప్రీతికరములుఁ బరమేశ్వరసాన్నిధ్య సంప్రాప్తికరములు నగు పరమధర్మము లనుఫలములను గావ్యకల్పకమునుండి కవిబ్రహ్మ జిజ్ఞాసువులయాత్మతృప్తికొఱకనంతములుగా వెదచల్లవలయును. ఇందులకు నిదర్శనములు మనభారతాదులే.

ఈసత్యమును గ్రహించి యార్షసాంప్రదాయాభిరుచి గలనేఁటియువకవులును గొంద ఱాధ్యాత్మికేతివృత్తమును గొని భారతసముద్రమునందలి రత్నములను వెలికిఁ దీసి తమ కావ్యామృతమున వాని నభిషేకించి పవిత్రు లగుచున్నారు. వీరిలోఁ బ్రకృతకావ్యకర్త యగుచిరంజీవి రామమోహనుఁ డొకఁడు.

పాశ్చాత్యవ్యామోహపిశాచావేశమున నొడలు తెలియక యార్యసంస్కృతిని నార్షవిజ్ఞానమును దూలనాడు దుర్దినములు మనకు భారత స్వాతంత్ర్యముతో సమసిపోయిన వని చెప్పవచ్చును. కాని యీసంధియుగమున నాఛాయలు చాలఁగలవు. ఆవ్యామోహవృక్షము వేళ్లుపాఱి శాఖోపశాఖలుగా వెలసియుండుటచే దాని సమూలనాశనమున కింకను గాలము పట్టును. ఈపనికిఁ బరిణతబుద్ధు లగుయువకులు సాహిత్యతత్త్వము నెఱిఁగి దాని నుపాసింపవలయును. ధర్మోపదేశయుక్తము లగుకావ్యరాజముల రచించి ధర్మబీజములు లేఁతహృదయముల నాఁటవలయును. అవి మొలకెత్తి చిగిరించి పుష్పించి ఫలించి నప్పుడే మనకు రామరాజ్యమును మనము భారతీయులము నని గర్వమును. ఈదృష్టితో నీచిరంజీవి రామమోహనుఁడు భారతసంహిత నాశ్రయించినాఁడు. శాంతిపర్వమును మథించినాఁడు. ఏతత్కథామృతమును దనివితీరఁ గ్రోలినాఁడు. ఇంకను సంతృప్తి కొఱకై వయోవిజ్ఞానములఁ బిన్నయయ్యుఁ దనకమితాభిమానము గలకథానికలలో నొకటి యగు "కపోతకిరాతోపాఖ్యానము" గైకొని తోఁచినరీతి తనజిలిబిలిపలుకులతో వన్నెలు చిన్నెలు పెట్టి యీలఘుకావ్యమును సంతరించి "కపోతీకపోత" మనుపేరఁ బ్రకటించినాఁడు.

ఇందలియితివృత్తము పరమప్రశస్తము. ఈకవి యిం దారంభించిన కావ్యపద్ధతి ప్రాచీనకవిసమ్మతము. శిష్టజనాంగీకృతము. ఈతఁడు చూడఁగ నింటరువిద్యార్థి,ముక్కుపచ్చ లారనివాఁడు. భారతభక్తి, సద్గుణప్రీతి, రచనోత్సాహము ముందునకు నెంట నీతఁడు కావ్యరచన మారంభించినాఁడు. ఐన నేమి! పెద్దలకును నలవడని రచనాకౌశలము, పరిణతకవులకును సాధ్యము కాని

ధారాశుద్ధి యీకపోతీకపోతముఁజక్కఁగాఁదలఁదాచుకొన్నవి. తొలుదొలుత వింధ్యనగరవర్ణనము, వనవర్ణనము సూర్యోదయ సూర్యాస్తమయాదివర్ణనములు నీతనికిఁ గలప్రతిభ చక్కని దని చెప్పకచెప్పుచున్నవి. మఱియు :

"అమలినచంద్రచంద్రికల నత్యధికంబుగఁ గ్రోలుచక్రవా
కములు నిజోదరోజ్జ్వలితగాఢతరాగ్ని శమింపఁగోరి హా
రముక్రియ శీతలోడునికరంబులఁ గూడ భుజించెనో యనన్.

... ... ... అనినపుడు

"దురితదూరుఁడు వసురాజు తూరుపుకొనఁ
గానఁబడ భీతిఁ దిమిరతస్కరుఁ డడంగె;
సలిలపూరంబునఁ గరఁగు చక్కెరవలెఁ
బలుచఁబాఱెను జీకటి వెలుఁగులోన" అని వర్ణించునపుడు

మనకవికుమారునిలేఖినికిఁ జాల నుత్కృష్ట మగుభవిష్యత్తు గల దని తోఁచకపోదు. ఈతనిధారాశుద్ధి నరయుటకు

"రంగత్తుంగతరంగసంగతమహోగ్రార్భాటసంకీర్ణమా
గంగానిమ్నగ శర్వు వీడి భువిఁ బొంగంబాఱుచందంబుగా..."

"సుతులు లేని పుట్టిసుదతిసంసారంబు
సాగరంబు దుఃఖసాగరంబు."

"ధణధణభీషణార్భటుల ధాత్రి పగుల్పడఁ జంచలద్యుతుల్
కనులకుఁ గంటకంబులయి క్రాలఁ గరాళకరీంద్రకంఠబ
ృంహణకలకంఠికంఠఖజరీటకమాలవిగాఢకాంతి నా
ఘనఘనసంఘమధ్యమునఁ గప్పెఁ గిరాతుఁడు చూచుచుండఁగన్."

మున్నగుతావు లెన్నియే నుదాహరింపవచ్చును.

కపోతము కపోతితో:

"ఖగరాజేశ్వరి! దైవకృత్యము లెఱుంగన్ శక్యమే యేరికిన్"

అనుచప్పుడు, "దుఃఖముక్, పొరయునె నిన్ను సౌఖ్యములు పొందుట తప్ప మహేశుసత్కృపక్" అన్నప్పుడు

"కరుణాసాగరుఁ డాదయామయుఁడు దుష్కర్మంబులన్ సైఁచి దు
స్తరకష్టంబులఁ దీర్చినాఁడు శిశుసంతాపంబు నోదార్చినాఁ
డరయన్ నిన్నిట నాకొసంగి యపవర్గానంద సౌఖ్యంబులన్
బరమార్థంబు లొసంగినాఁ డతివరో! ప్రార్థింతు నే నీశ్వరున్."

అనుశివభక్తి కపోతమునకును గల దని చాఁటి తనయీశ్వరభక్తిని గవి యిట ద్యోతక మొనరించినాఁడు. "పతులకుఁ బత్నులే పరమభాగ్యము" లనియు, "అతిథిం గాపాడఁ గర్తవ్యమా" ననియు నాయాతావులఁ గవి తనధర్మబోధకతాశక్తిని బ్రదర్శించినాఁడు. ఇట్టివే కాక!

"కాలసర్పంబునోటను బాలు పోసి
ప్రేమతోఁ బెంచినను గాటు వేయకున్నె?
పక్షిహంతకు శీతలబాధ నణఁచి
రక్ష చేసిన మనకు సంరక్ష యగునె?"

మున్నగుపోలికలను, 'మసిబొగ్గుగీచినమచ్చ' 'మబ్బు లేకయె పిడుగు లుబ్బెత్తువడురీతి' 'గ్రామదేవతనోటఁ గరకకాయ దవిల్చి' 'కంటను వత్తిఁబెట్టుకొని' మున్నగు తెలుఁగునానుడులను జక్కఁగా నీకవి వాడినాఁడు. మఱియుఁ బ్రయాణమువేళ నశుభముల నీతఁ డిట్లుసహజముగఁ బేర్కొనినాఁడు:

"ఎరఁగ్ర లెమరయ్యె మేఘము లుఱిమెఁ జదలఁ
దిరిగ ఫేరువు లెదురుగ నఱపు లిడుచు
వీచె జివ్వునఁ బెనుగాలి విఱుగ నగము..."

అన్నిటికన్న మిన్నయైన దీకవికుమారుఁడు తీసికొన్న యతివృత్తప్రాశస్త్యము. అతిథిసేవాప్రభావము, ఆత్మత్యాగశక్తి, ఈశ్వరపదపద్మపూజాభిలాషము, మున్నగునార్యధర్మము

లెన్ని యో యిందుఁ దలఁదాచుకొన్నవి. ఆర్ష భారత దేశమున మానవులమాట యటుండనిండు. పశువులు పక్షులు కూడ నింత చరితార్థజీవనములఁ గడపి యున్న వని మనపురాణములు ఘోషించుచున్న వన మనభారతభాగ్యమునకు మేర కలదా? ఇఁక మానవులెంతెంత యుత్కృష్టజీవనములఁ గడపవలయునో దీనినిబట్టి యూహింపవచ్చును. ప్రాచీనగాథలను బ్రాచీనపద్ధతిని రచించుట పరమదోషమే యనుకొనునేఁటియువరచయిత్రులోకమున నిట్టియితివృత్తమును గైకొని యిట్టిమధురకవితారీతులఁ బుణికిపుచ్చుకొని యిఁతమార్దవముగా నీకృతి రచించి ప్రకటించిన చిరంజీవి రామమోహనుఁడు నిజముగ నభినందనార్హుఁడు. ఈతఁ డితోధిక మగుకవితాసంపదచే నితోధిక మగుమహేతివృత్తములఁ గైకొని భాషామాత నెంతయు నారాధించుఁగాక! ఉత్తమభవితవ్యమును గనఁబఱచునీతనికవితాశక్తి క్రమపరిణామమున నింకను రమణీయమై సహృదయహృదయములఁ జూఱగొనుఁగాక యని యీచిరంజీవిని హృదయ పూర్వకముగా దీవించుచున్నాను. రసికహృదయముల కీతనికవిత సన్నిహితమగుట రసికవతంసు లీతని నాదరించి యాశీర్వదింతురుగాక!

ఇట్లు,

విరోధి: విజయ దశమి
కాకినాడ,
౧—౧౦—౪౯

బులుసు వేంకటేశ్వర్లు బి. ఏ.
సంపాదకుఁడు, వావిళ్ల నిఘంటువు.
ఆంధ్రాధ్యాపకుఁడు, పి. ఆర్. కాలేజి.
గ్రంథకర్త: శ్రీమహర్షి జీవితకథామృతము, అష్టావక్రచరిత్ర, కుందమాల, అభిషేకము, అహల్యాగౌతమము ఇత్యాది.

# వినతి

శ్రీమన్నారాయణాంశజుఁడు వ్యాసుఁడు. ఆతఁడు రచించిన వానిలో భారతగ్రంథ మొకటి. కవిత్రయము దాని నాంధ్రీకరించినారు. ఆంధ్రీకరణమూ మనోజ్ఞము. పాకమూ ద్రాక్షాపాకము. ఇంకఁగావలసిన దేమున్నది? బంగారమునకే తావి యబ్బినది. భారతమే కల్పక మైనది. ఆ పర్వములే కల్పక శాఖ లైనవి. అందలి ఘట్టములే యమృతఫలము లైనవి.

అదియునుంగాక శాంతిపర్వము ఉపాఖ్యానక శాఖోప శాఖలకుఁ బుట్టుఁగొమ్మ. అవియన్నియు ధర్మ జ్ఞాన వైరాగ్య బోధకములు. అందలి పద్యములా రసగుళికలు. అమృతరుచ్యములు. కావుననే భారతపర్వములనెడు హారమునకు శాంతి పర్వము నాయకమణియై విలసిల్లినది.

చదువరుల మనమాకర్షించునది "కపోతకిరాతోపాఖ్యానము". ఇది శాంతిపర్వ తృతీయాశ్వాసమందలిది. ఇందుఁ గపోతముల ధర్మచింతనము, భగవద్భక్తి, శరణాగతరక్షణము, అతిథిపూజ, త్యాగశీలము మొదలగు నంశములు మనోహరముగాఁ జిత్రింపఁ బడినవి. భారతీయాదర్శగృహస్థధర్మములివి యేగదా!

ఇతర గాథలకంటె నన్నాకర్షించినది "కపోతదంపతుల కథ." ఎన్ని పర్యాయములు చదివినను దనివితీరని దిది. వినువారికిఁ జవులూరఁ జేయునది. అదియునుగాక పుణ్యశ్లోక కథాకథనము వలన వాక్శుద్ధి యగునని పెద్దల వచనము. అట్టి

వాక్శుద్ధి కొఱకై నేనీ పుణ్యకథ మూలము చెడనట్లు పెంచి వ్రాసితిని.

చారిత్రకముగా నొక గాథ కలదు. తూర్పు గోదావరి జిల్లా రాజోలు ప్రాంతమున "కడలి" యను గ్రామము కలదు. అచ్చటి శివాలయము పురాతన మైనది. దానికెదు రుగ నొక జలకుండమున్నది. ఆ సమీపముననొక వటము గలదు. ఆ శివుని "కపోతేశ్వరుఁడ"నియు, జలకుండమును "కపోతకుండ"మనియు వ్యవహరింతురు. శివలింగాగ్రమునఁ గపోతమిథునముగల చిత్రమున్నది. ఇదియే మున్ను కపోత దంపతులు కిరాతు నర్చించి కైవల్యమందిన పుణ్యభూమి యని ప్రతీతి. ఏఁటేఁట శివరాత్రి కిచ్చట నుత్సవముఁ జేయుదురు. ఇది స్థలపురాణ గాథ.

ఈ చిన్న కావ్యమును దీక్షకచేసికొని సాంతముగఁ జదివి నే కోరినంతనే యమూల్యమగు "పీఠిక" వ్రాసి యిచ్చిన కవి తల్లజులు, పండితాగ్రణులు నగు బ్రహ్మశ్రీ శ్రీ బులుసు వేంక టేశ్వరులు, బి. ఏ. గారికి నా హృదయ పూర్వక వందనము లర్పించు చున్నాఁడను.

వాస్తవముగా నే నన్నివిధములఁజిన్నవాఁడను. కళాశాలా విద్యార్థిని. ఇందలి గుణలేశమునే గ్రహించి పెద్దలు నన్నాశీర్వ దింతురుగాక! రసికహృదయముల కివే నావినతిశతములు.

కాకినాడ, 1-10-49.
విరోధి: విజయదశమి

ఇట్లు విధేయుఁడు,
జోస్యుల రాజా రామమోహనరావు.

# ఆశీస్సు

కవిసమ్రాట్, మహాకవి

బ్రహ్మశ్రీ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ఎం. ఏ;

Head of the Telugu Department,
S. R. R. & C. V. R. College, Vijayavada,
Member, Andhra University Senae, etct.

"మీ "కపోతీకపోతము" చూచితిని. ఎన్నిగుణములు మిత్రులు, కవులు, పండితులు అయిన శ్రీబులుసు వేంకటేశ్వర్లు గారు ఉన్న వని వారిపీఠికలో వ్రాసిరో అన్నియునిస్సందేహముగ నున్నవి. మీరు ఇంకను వృద్ధిలోనికి వచ్చి సద్గ్రంథరచన చేయుదురుగాక! మీరు గొప్పకవు లగుటకు సామగ్రి కుదిరినది. వృద్ధిచేసిలగుటయే మిగిలినది." విశ్వనాథ సత్యనారాయణ.

# అభిప్రాయము.

బ్రహ్మశ్రీ శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు ఎం. ఏ. (ఆనర్సు)

Head of the Oriental Department,
Mrs. A. V. N. College, Vizagapatam,
Chairman Board of Studies in Telugu
(Andhra University)

"చిరంజీవి రామమోహనరావు రచించిన "కపోతీ కపోతము" అను చిన్నకావ్యమును సాంతముగాఁ జదివితిని. భారతాంతర్గతమైనకథనే కవి వర్ణనాదులచేఁ బెంచి రసప్రవాహముగునట్లుగా సంతరించినాఁడు. శైలి సలక్షణమును ధారాశుద్ధి భరితమును, రసవంతమునై చదివినకొలఁది చవులూరించుచున్నది. ఇందలి సరళమృదులమైనభాష, మధురగంభీరములైనభావములు, ఉచితమైనపాత్రపోషణ యీ బాలకవి మున్ముందు ప్రౌఢకవియై వెలయుననుటకుఁ దార్కాణముగా నున్నవి. భగవంతుఁ డీతనికిఁ జిరాయురారోగ్యభాగ్యములును, ఉదాత్తచిత్తతను, బహుళకావ్యరచనాదక్షతను జేకూర్చిరక్షించుఁగాక." దివాకర్ల వేంకటావధాని.

# అభినందనములు

శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు ఎం. ఏ;

Retired; Head of the Telugu Department,
Andhra University, Waltair.

"మీరు పంపిన మీ కావ్యము "కపోతీ కపోతము" అందినది. చాలకృతజ్ఞత. సాంతముగాచదివి ఆనందించితిని. మీకు నా అభినందనములు."

పి. లక్ష్మీకాంతం.

అభినవతిక్కన శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు.

"ఆర్యా, మీరు పంపిన "కపోతీ కపోతము" అందినది. చదివితిని. ధర్మబద్ధమైన మీ కవిత నన్ను లెస్స యలరించె. ప్రాచీన కవులంబలె నిర్దుష్టరచన కిచ్చపడు మిమ్ము బహుధా కొనియాడు చున్నాను. ఆంధ్రసారస్వతమున మీకునుత్తమస్థానము రానున్న దని నా విశ్వాసము."

తుమ్మల సీతారామమూర్తి.

—: పద్యత్రయి :—

శ్రీ యోగానందకవి గారు,

శ్రీమద్యోగానందాంధ్ర రామాయణాదిశతాధికగ్రంథకర్తలు, శతావధాని.

ఖ్యాతమగు నీ "కపోతీ కపోతము" నుతి
పాత్ర మగు రమ్యశైలి నొప్పారెఁ జూడ
ఇంటిగుకలార్థి! జోస్యులా! యింత మధుర
ఫణితి రచియింపఁగన్న నీ భాగ్యమెంతొ.

ఆంధ్రయూనివర్సిటి వార లాంధ్రుఁబొటఁ
బట్టి యిట్టి యాంధ్రకృతుల పద్యహృద్య
భావఘణుతుల నరసి చేపట్టినపుడె
కావ్యకర్తలు పారకుల్గాంత్రు ముదము.

భారతాన్వయమణు లైన బాలకవులు
లేకపో రిప్పు డెప్పుడీ లీలఁ జూడ
గోడచేర్పున్న నేకదా! కొమరు మిగులు
స్వర్ణపాత్రము, నీకు శుభంబు గాత!

శ్రీ

# కపోతీ కపోతము

శ్రీకృష్ణామల పాదపద్మయుగళీ సేవారతుఁ దివ్యగం
గాకాంతా ఘనగర్భసంభవుని విఖ్యాతుఁ సుధర్మజ్ఞునిన్
రాకాచంద్రకులాన్వయాభరణుఁ గౌరవ్యోత్తమున్ భీష్మునిన్
లోకారాధ్యుఁడు ధర్మరాజు కని పల్కెన్ భక్తి సంయుక్తుఁడై .1

"ధర నెందైనను నీ వెఱుంగనిమహాధర్మంబులుఁ గల్గునే
పరమజ్ఞాన నిధాన ! నాకుఁదెలుపన్ బ్రార్థింతు నత్యంతమున్
శరణార్థిన్ బరమాతిథిన్ గొలువఁగా సంధిల్లుపుణ్యంబు నో
కురువంశోత్తమ! నాకుఁ దెల్పఁగదవే! కోట్యంజలుల్ నీ కివే". 2

అనినన్ ధర్మజుఁ గాంచి భీష్ముఁడు కృపాయత్తాంతరంగుండునై
యను "నోధర్మకుమార! ధర్మములయం దత్యంతముఁ బుద్ధి ని
ల్పినమాన్యుండవు తెల్పెదఁ సకల మాలింపంగదే శ్రద్ధతో
డను నుత్కృష్ట కపోతదంపతుల రూఢంబైన యాఖ్యానముఁ".3

ఆకాశగమనంబు నరికట్టి రవిచంద్ర
గ్రహముల నిలిపిన గ్రావ మనుచు
శిఖరిరాజంబుల శిక్షించు శచిపతిఁ
నెదిరించినట్టి మహీధ్ర మనుచు

కపోతీకపోతము

దక్షిణదేశమందలి హిమాలయ మంచు
నర్చింపఁబడిన యహార్య మనుచు
ఆర్యసంస్తవ నీయుఁడైన యగస్త్యుని
కాతిథ్య మొసఁగిన గోత్ర మనుచు

వింధ్యనగరాజ మహిమంబు వివిధలోక
ముల దివిజవరేణ్యులు మున్ను ముచ్చటింప
సర్వమెఱిఁగిన మునులెల్ల సన్నుతించి
నారు ! ధర్మజ ! బహుపురాణములయందు. 4

సాంద్ర తమాల వృక్షచ్ఛన్న నిబిడాంధ
కారబంధుర మైన గహ్వరములు
కమనీయ ఫుల్లసౌగంధికయుత లస
న్మధురాంబుపూర పద్మాకరములు
అశ్మజ గంధాశ్మ నశ్మగర్భ హిరణ్య
ఖర్జూర పారద గైరికములు
అమరవిద్యాధర ప్రమథ సంఘాతసం
చారయోగ్యానేక సానుతతులు

గలిగి వింధ్యాద్రి మేరునగంబుపోలె
శివుని ధైనట్టి కైలాస శిఖరిపోల్కి
పార్వతీమాత పుట్టినిల్లుపగిదిఁ దనరు
సర్వసౌభాగ్య సంపదాస్పద మనంగ. 5

అంబర చుంబితాహార్యాగ్రములనుండి
పుడమిఁ బడుఝరాంబుపూరములును
గండశైలముల విఖండనంబొనరించి
వడి జాఱుహైమప్రవాహములును
సాంద్రవృక్షచ్ఛాయ శ్రమములు వాయఁ బరుండు
సకలాండపిండజ సంతతులును
కడుపార భుజియింపఁ గందమూలఫలాది
బహుభక్ష్యభోజ్య సంభారములును

సహజ శృంగారరూప నిసర్గగరిమ
వాంఛ లొదవించు బహుపుష్పవాటికలును
గలిగి మానవవాస యోగ్యంబు గాఁగ
వఱలు వింధ్యంబు దక్షిణావర్తమందు. 6

ఆవింధ్యాచల సన్నిధి
నావాసము గాఁగ బోయ లందఱు హాయిన్
జీవితములఁ బోఁబుచ్చుచు
జీవింతురు సతులు సుతులు స్నేహ మెలర్పన్. 7

ఆవింధ్యాచల సానుదేశముల భార్యాపుత్ర సంయుక్తుఁడై
గోవిందాక్షరపంక్తిదూరుఁ డగుచున్ క్షోదిష్ఠసంకల్పుఁడై
లావుం దేకువ గల్గి యద్ధరణి నెల్లన్ దాన కొల్లాడుచున్
జీవించున్ మృగయుం డొకండు కరుణాశ్రీకిన్ విదూరుండునై. 8

కపోతీకపోతము

మసిబొగ్గు గీచిన మచ్చకు స్వచ్ఛనె
మ్మనిరంగు తళుకుక్కు మెఱుఁగువాఁడు
తడి గల్గి యూరక ధగధగద్ధగ వెల్గు
నిప్పుకల్ గేరు కన్ జిప్పవాఁడు
మబ్బు లేకయె పిడుగు లుబ్బెత్తువడురీతి
లం బైనకంఠనాళంబువాఁడు
గ్రామదేవతనోటఁ గరకకాయ దవిల్చి
నుడివడ్డనిడుద పెగ్గడుపువాఁడు

శస్త్రవిద్యాగరిష్ఠుఁ డశాంతమూర్తి
దీర్ఘకాయుఁడు ఖగహంత తిండిపోతు
క్రూరకర్ముఁడు నగు వ్యాధకులుఁ డతండు
వన్యసంతతి వేఁటాడు వ్యసనుఁడగుచు. 9

ఆటవలె నెంచు నతఁడు
గ్రాటవిఁ గుటిలజటిల మృగరాట్ బృందములన్
వేఁటాడుచు, మల్లురతోఁ
బోటాడు టభీష్టముగను బోయని కెపుడున్. 10

కంటను వత్తిఁ బెట్టుకొని కన్నని సుంగుల నెల్లవేళఁ దా
నింట సుఖోన్నతిన్ బెనుచు నెప్పుడు సంతసమందుచుండు ని
ష్కంటకవృత్తిమై నచలసామ్యపు లంపు విహారలీలలన్
జంటయిపోయి కాలమును సౌఖ్యముగాఁ గడపంగిరాతుఁడున్. 11

పరిసరపు వింధ్యభూములఁ
బరగెడు వింధ్యాద్రివనము, భయజనకంబై
నటవుల మృగములు పల్లియ
దరియంగా వచ్చి పోవుఁ దగులము మీఱన్. 12

అచ్చటి సాధుజంతువుల నశ్రమలీల వధింప బోయ, పె
న్నిచ్చకొలంది బోయతయు నింపొసఁగన్ బచనంబుఁ జేసిగో
ర్వొచ్చఁగఁ బెట్టుఁ దానుఁ దనపిల్లలు నాఁకలిదీర్చుకొంచు నా
మచ్చున సాఁగు నిత్యముఁ గ్రమంబున బోయని కాఁపురంబటన్.

ద్రాక్షాఫలహారంబులు
ద్రాక్షాసవపానములును దప్పించినచో
వృక్షాహార మెఱుంగకె
కుక్షిని దనియింపుచుందురు క్రూరులు వారల్. 14

ఈవిధమున వనమృగముల
నేవిధ మగుజాలి లేక యిడుములగుడుపన్
జీవించుచు బోయఁడు తాఁ
గావించును జీవయాత్రఁ గడఁగి విభీతిన్. 15

ఒకనాఁ డాతనిఁ గాంచి బోయతయు క్షుద్రోత్సాహదుశ్చింతయై
శుకరత్నంబును బోనిపల్కుల నిజేశున్ బ్రీతుఁగావించి సిం
హకిశోరంబులఁ బక్షియూథములఁ దెమ్మా! చంపి నాకంచుఁగో
రిక లీరెత్తఁగ నాథుఁగోరుటయు; నా కేయెల్ల నిచ్ఛారతిన్. 16

సతిని సుతులఁ గూడి సంతసమందుచుఁ
గొంతప్రొద్దు గడపి కుటిలుఁ డంత
సుదతికోర్కెఁ దీర్ప ముదమున వఱువాతఁ
గదలఁ దలఁచె విధ్యగహానమునకు. 17

బోయకాంత కంత బోయఁడు వేటకు
వెడలఁ దలఁచుకొన్న విధముఁ దెలిపి
నాఁటి రేయి హాయి నతివతో నిదురింప
మేలుకొలిపె సుదతి మేలుకొలుపు. 18

అమలినచంద్ర చంద్రికల నత్యధికంబుగఁ గ్రోలుచక్రవా
కములు నిజోదరోజ్జ్వలిత గాఢతరాగ్ని శమింపఁగోరి హా
రముక్రియ శీతలోడు నికరంబులఁగూడ భుజించెనోయనన్
విమలినతారకాతతులు వెల్వెలఁ బాఱె కృశించె నత్తఱిన్. 19

పరజనచారచోరులను భర్మగృహంబులఁ జేరనీక భీ
కరకరవాలహస్తులయి కాపులు మాపులు గాచువారివోల్
సరసిజవైరిపాలనఁ బ్రశాంతమనోహర రమ్యకాంతులన్
కర మనురాగమై కళలు కగ్గెను వేకువజామునందునన్. 20

కలకలమంచుఁ బక్షికులకాంతలు పాచిపనుల్ వొనర్పఁగా
విలసితపుష్పసౌరభము వీవ వనమ్ములు తేజరిల్లఁగాఁ
బలపలటంచునున్ ప్రకృతి పావనగీతిక లాలపింపఁగా
వెలవెలఁబాఱెఁ దూర్పుదిశ విశ్వధరావలయంబు మేల్కొనన్. 21

దురితదూరుఁడు వసురాజు తూరుపుకోనఁ
గానఁబడ భీతిఁ దిమిరతస్కరుఁ డడంగె
సలిలపూరంబునఁ గరఁగు చక్కెరవలెఁ
బలుచఁబాఱెను జీకటి వెలుఁగులోన. 22

మేలుకొని బోయఁ డంతటఁ
గాలక్రియవితతిఁ దీర్చి గ్రక్కునఁ జలిదిన్
లీలఁ గుడిచి యాఖేటన
లోలుపుఁడై వెడల నడచె లోకము గదురన్. 23

తీవ్రతరోజ్జ్వల తీక్ష్ణ సాయకనిషం
          గము పెడబుజమందుఁ గ్రాలువాఁడు
భీకరఘూత్కారకాకోదరోగ్రకో
          దండంబు కరమందుఁ దనరువాఁడు
బ్రహ్మాండభాండంబు బంధింపఁజాలిన
          వాగురల్ భుజమున వఱలువాఁడు
కీర కపోత కేకి మృదు తూలికలకి
          రీటంబుఁ దలను ధరించువాఁడు

పచ్చపూసలు రుదురాకపాలపూస
లమలకాంతుల సీసుహారములవాఁడు
శరము వెలయును లోకభీకరుఁడు గాఁగ
బోయ వింధ్యాటవికి వేఁటపోవునపుడు. 24

కపోతీకపోతము

బుడుతకుఱ్ఱల ముద్దాడి బుజ్జగించి
కంబుకంఠిని కౌఁగిట గారవించి
చిత్త మనిశంబు వేఁట నాయత్తపఱచి
బోయ వింధ్యాటవికి వేఁటపోయె నపుడు. 25

తెలతెలవాఱఁ దూర్పుదిశ తేటజలంబులఁ దేలియాడి యుం
జలి ఘటియించి నీరములు సారమృదుస్వరసామగీతు లిం
పలరఁగ లోకబాంధవునియర్చనలన్ దనియించుపద్మినీ
లలన లనంగ నొప్పెడు జలాశయమై జసుమాపసంపదల్. 26

పలుబలువింతయత్తరులఁ బ్రాఁమి మనోజ్ఞవిరాజమానమా
పలుఁవలు దాల్చి భృంగపతివారములన్ గవయంగ నిర్ణయ
స్థలి ముద మూరఁ గాయునభిసారికపోలికఁ బూపడంతులున్
గలిగినయౌవనోజ్జ్వలితక్రముకషాయసుమప్రవాటికల్. 27

రంగత్తుంగతరంగసంగతమహోగ్రార్భాటసంకీర్ణమా
గంగానిమ్నగ శర్వు వీడి భువిఁ బొంగంబాఱుచందంబుగా
రంగత్తుంగమహీంద్రమాళిశిఖరాగ్రస్థానదేశంబులన్
రంగారన్ జనియించి ధాత్రిఁ బడి పారావారమా నిర్ఝరుల్. 28

వలిమలవారముల్ విమలవారితరంగతరంగిణీతతుల్
లలితమనోజ్ఞసంభరితలాజలతాసమభూప్రదేశముల్
విలసితరక్తరాగరుచి వెల్గెడుజేగురుఁగొండగుట్టలున్
ఫలములఁ గాయలన్ గనులపండువుచేసెడువృక్షవాటికల్. 29

కడచి కడచి ప్రకృతికాంతవినోదము
లరసి యరసి మనసు హర్షమంద
సంతసంబుతోడ సాంద్రాటవీస్థలి
దరికి బోయఁ డప్పు డరుగునంత. 30

ఎరఁగ లెదురయ్యె మేఘము లుఱిమెఁ జదలఁ
దిరిగె ఫేరువు లెదురుగ నఱపు లిడుచు
వీచె ఱివ్వున పెనుగాలి విఱుగ నగము
లెఱుకఁ డెఱుగఁడు తలఁపఁడు నెద నశుభము. 31

కాన నిర్దహించుకార్చిచ్చునుం గాంచి
బాణతూణసమితి బరువు డించి
చెంత నున్నకొండఁ జిటికెలోఁ దగ నెక్కి
కలయఁ జూడ బోయ కాననమును. 32

కరము భయాస్పదం బగుసృగాలమృగేంద్రవరాహజాల భీ
కరఫణిరాజసంతతుల గాఢకఠోరమహోగ్రరీతి బొం
గరములవోలె నుగ్రపుశిలావళులన్ శిరసావహించు భూ
ధరములఁ గాంచి బోయ యమితంబగుహర్షపయోధిఁ దేలుచున్.

విల్లమ్ములుఁ దగఁ దాలిచి
యుల్లము నాఖేటరతుల నుత్సవ మొప్పన్
జిల్లనుగాలికిఁ బుల్కలు
పెల్లుగ మే నలర బోయ విపినముఁ జేరెన్. 34

సాంద్రవృక్షస్కంధ సంఘుంబులం దాఁటి
చొచ్చుక పోలేదు సూర్యశక్తి
కంటకావృతలతాక్రాంతనిర్గమవీథిఁ
బచరింపఁగా లేదు పవనుశక్తి
ప్రబలభీకరదుష్టవన్యసత్త్వంబుల
నవయింపలేదు పినాకిశక్తి
మృదుపుష్పభరితసమ్మధురఫలతరుల
కనలి మాడ్చఁగ లేద యనలుశక్తి

వన్యశక్తి బలీయమై యన్యప్రకృతి
శక్తి నోడించి పాలనాసక్తిఁ బూని
రాజరాజేంద్రుపోలికఁ దేజరిల్లు
సాంద్రవింధ్యాటవీస్థలి సంతసమున. 35

చొచ్చి జీవాంతకుఁడు మన్నుఁ జూచి మిన్నుఁ
జూచి వనరాజవృక్షముల్ జూచి కటకు
టమ్ము దీసి శరీరరక్తమ్ముఁ దీసి
అమ్మరో! కావుమంచును నంజలించి. 36

సాల తమాల రసాల చందన బిల్వ
వట లవంగ వకుళ కుటజతరుల
నాగమల్లిక జాజి నాగమల్లి మరువ
పున్నాగ మత్తల్లి పుష్పలతల

శార్దూల మృగరాజ సారంగ మర్కట
శరభేభమార్జాలజంతుతతుల
శుక కేకి సారంగ పిక కపోతాదికా
రండవోలూక బకాండజముల

అమలజలముల మిట్టపల్లములఁ గ్రిములఁ
గీటకాదులఁ జిత్తడిబాట లలర
భీతి గల్గించువింధ్యోగ్రవిపినవీధి
కలికుబోయండు మఱిమఱి తిరుగఁ జొచ్చె. 37

ఒకదిక్కుఁ గాంచినఁ బకపకనవ్వులం
బరియాచకములాడుమర్కటములు
నొకవంకఁ జూచిన నుయ్యేల లూఁగుచుఁ
గిచకిచధ్వని సల్పుకీశతతులు
నొకచట్టు పరికింప నుర్వీజములనుండి
ఫలహారములఁ గొనువానరములు
నొకచోట గమనింప నొయ్యారమునఁ జూచి
పం డ్లిగిలించుప్లవంగకోటి

ఏఱి మేని పేల నోరను వైచుచుఁ
గ్రిందిమీఁది కుఱికి కీచుమనుచుఁ
బాలఁ గుడువ నిచ్చి లాలించుబిడ్డల
ముట్టియాడుకోఁతిమూఁకఁ జూచి. 38

దిక్కుమొక్కు లేక బిక్కమొగమువైచి
లెక్కలేనిపాట్ల బక్కచిక్కి
క్రుంగి క్రుంగిపోయి కృశియించి రాలెనో
యనఁగఁ బుడమినిండ నలరు లలర. 39

అబల గాన నామె కాధార మేదైన
వలయుఁగాదె యన్న పలుకు దెలుప
నలరులతలు కుటజ మాధారములు గాఁగ
రంగురంగుపూలఁ బొంగుచుండ. 40

సుతులు లేనియట్టిసుదతిసంసారంబు
సాగరంబు దుఃఖసాగరంబ
యనుచు ధర్మపన్న మాలాపనలు చేయు
పండ్లలతలఁ జూడ పండువగును. 41

గుంపుగుంపుగాఁగ గుర్తెఱుంగను రాక
కలకలారవంబు గగనమంట
పెండ్లిగృహమొ లేక పెనుకయ్యమోగాని
శంకపుట్టు మదిని శకులఁ జూచి. 42

వింతవింతసృష్టి వీక్షించి వీక్షించి
పొంగిపొరలుముదముపొంగు నణఁచి
విల్లుఁ జేతఁ బట్టి విపినమధ్యంబునఁ
గడచు బోయ సింహగర్జ వినిన. 43

కులకులఁ గూయునండజము కోటరమందు నడంగె, జంతుమం
డలము విభీతి భారపుటెడందల వాసము చొచ్చె, భూజముల్
అలముల రాల్ప నూనెఁబవనంబు చలింపదునయ్యె బోయఁడున్
జలితభయోగ్రుఁ డయ్యె మెకసామిభయంకరగర్జనార్భటిన్. 44

చెదరుహృదయంబు రాయిగాఁ జేసి వేగ
వన్యవటరాజ మెక్కి నివర్ణు డగుచుఁ
గొండకొమ్మున విహరించుకోదమసింగ
మొండుఁ గాంచి వనంబు బోయండు గాంచి. 45

విటపిశాఖ డిగ్గి విల్లమ్ములను బట్టి
జటిలజంతుతతులజాడ లేసి
తావులందు వలలఁ దగఁ బన్ని తండుల
ములను జల్లి కొండవలను జనుచు. 46

మిసమిసలాడు పచ్చికల మేసి గుభాలునఁ జౌకళింపుచున్
రసములఁ ద్రావుచున్ భయదరాగమనోహరదృష్టిఁ జూచుచున్
పసిదన మింపు నింపుమృగవారము ముద్దులమూట గట్టుచున్
గుసగుసలాడు క్షేత్రమును గ్రూరకిరాతుఁడు గాంచి నిర్దయున్. 47

గుట్టు దెలియకుండఁ జెట్టుమాటుల నక్కి
వింతయురులఁ బన్ని పుంతలందు
అదరు బెదరు లేడికదుపులఁ గొన్నిం టిఁ
గ్రూరమార్గణములఁ గూలనేయ. 48

చెంగునఁ జౌకళించి శరశీఘ్రగతిన్ విపినోర్విఁ బాఱుసా
రంగసమూహ మంటుచుఁ గిరాతుఁ డుదగ్రశరమ్ము లేయుచున్
జెంగట నొక్కచోఁ గనియె శీతజలంబుల నారఁగ్రోలి యు
ప్పొంగుచు గాండ్రుగాండ్రుమను భూరిభయంకరజంతురాజమున్.

కాంచి బెబ్బులి వేఁటాడఁ గాంక్షచేసి
యల్లనల్లన పుడమిపై నడుగు లిడుచుఁ
గల్పవృక్షంబుఁ బోలు వృక్షంబు నెక్కి
అలయికలువాయ మలయానిలాళిఁ బీల్చి. 50

బలము పెద్ద గలిగి బాహాపటుస్ఫూర్తి
మెఱయ కఱకుటమ్ము గుఱిగఁ బెట్టి
సప్తసాయకముల సంధించి వరుసన
వ్యాఘ్రిదర్ప మణఁచె వ్యాధుఁ డంత. 51

బలమునఁ బాశముల్ వఱపి వన్యమృగంబుల బందిచేయుచున్
జెలఁగెడుసూకరమ్ముల విచిత్రముగా ధరఁ గూలసేయుచున్
గులకులఁ గూసి చెట్లమునుఁగున్ దెరలందునఁ జొచ్చుపక్షులన్
వలలను వైచి పట్టెను నవక్రగతిన్ గతశాంతుఁ డయ్యెడన్. 52

పలురకముల వనమృగములఁ
బలుపలుకులు వలుకుశకులఁ బట్టియు ముదమున్
గలుగదు బోయనిమనమునఁ
బలుగొమ్ములమెకపు రిపుని బట్టఁగలేమిన్. 53

విగతజీవు లైన వివిధసత్త్వంబులఁ
బొదలమాటు కీడ్చి పదిలపఱచి
అచట నచటఁ బడిన యమ్ములఁ జేఁబట్టి
అద్రికడకు నేఁగి క్షుద్రుఁ డంత. 54

కొండచుట్టుఁ దిరిగి గుహలెల్ల గాలించి
వేణువనముఁ జొచ్చి వెచ్చనూర్చి
హరిని గాన కెచట నారాట మందుచుఁ
దరణిమండుటెండఁ దరలిపోయె. 55

అంకురించి చిగురుటాకుల మొగ్గల
పూల నతిశయిల్లి రాలి పోయె
బోయచిత్తభూమి బోయత నాఁటిన
కోర్కెతీవ హరిని గానఁగలేమి. 56

ముద్దుఁబడఁతి రేయి ముమ్మాఱు మగుకూర్మిఁ
దెలియఁ జెప్పుకోర్కెఁ దీర్చలేక
చింత మోము వాల్చి చింతించుచును బోయ
వలలు బన్ని యున్నవలను కరిగి. 57

"తరమే బ్రహ్మకునైన వింధ్యవిపినాంతర్భూమి వేఁటాడఁగన్
దొరకొంటాయచలాగ్రగహ్వరములన్ దూఁగాడుసింహంబులన్
బరిమార్పన్ దరమే" యటంచు మది సంభావించి నిర్వీర్యుఁడై
పరితాపంబును బొంది వేఁట విడిచెన్ వ్యాధుండు నాపూఁటకున్.

వలల యురులఁ జిక్కి కలవరపడుచున్న
యండపిండజములయార్తిఁ గాంచి
కఱకుటమ్ము లేసి ఖండించి మృగముల
వలలఁ గట్టి బోయెపతగతతుల. 59

ఈవిధమున వనసంతతి
నేవిధమగుభీతి లేక యిడుములఁబెట్టఁగ
భావించి బోయచేష్టల
కావేశము నొందె ననఁగ నరుఁడు వెలిఁగెన్. 60

అలసట నొంది వేఁటల జలావళిఁ ద్రావెడుకోర్కెఁబోవుచున్
జలితలతాంతసంతతులచక్రబలాకమయూరరాజహం
సల జలకుక్కుటంబుల విసారకుళీరమహాగ్రనక్రమం
డలముల నిర్మలోదకతటాకము నొక్కటి బోయ గాంచినన్. 61

నిధిని బొడగన్న పేదని
విధమున దేశాంతరమున వీక్షించినసం
పద గలహితువలె బోయఁడు
ముదమున నుప్పొంగె సరసిముంగలఁజూడన్. 62

పద్మపత్త్రిపుటికఁ బానీయములఁ బట్టి
కడుపునిండఁ ద్రావి కఱకుబోయ
పశ్చిమాద్రి కరుగుభాస్కరు వీక్షించి
యింటికడకు వేగ నేఁగఁ దలఁచి. 63

చచ్చినమృగముల వలలన్
జొచ్చినసీడోద్భవములఁ జూచుచుఁ బ్రీతిఁ
జెచ్చెఱ గృహమున కేఁగఁగ
వచ్చినచో ప్పరయ బోయవాఁ డున్నంతన్. 64

ధణధణ భీషణార్భటుల ధాత్రి పగుల్పడఁ జంచలమ్యుతుల్
కనులకుఁ గంటకంబు లయి గ్రాలఁ గరాళకరీంద్రకంఠ బ
ర్హిణకలకంఠికంఠఖజరీటతమాలవిగాఢకాంతి నా [గన్
ఘనఘనసంఘ మభ్రమునఁ గప్పెఁ గిరాతుఁడు జూచుచుండఁ

కీరకపోతఘూకబక కేకిపనఃప్రియపక్షిసంతతుల్
సారమనోహరధ్వనులసంఘములై దిరుగాడె మింటిపైఁ
గ్రూరమృగాళి నల్దెసల ఘోరముగాఁ బరువెత్తె నార్చుచున్
బోరున శీతలానిలము భూరిభయంబుగ వీవ నత్తఱిన్. 66

ఫళఫళ విరిగెను దరువులు
తళతళ విద్యుల్లతాళి తనరెను మింటన్
ఫెళఫెళ నుఱిమెను జలదము
కలవరముం బొందె వ్యాధకాంత మనమునన్. 67

కరికరతుల్యభీకరముగా జలధారలు గ్రుమ్మరింప నం
బరధరమధ్యదేశము నపారమహార్ణవవారిపూరమై
వఱలఁగఁ బిడ్గు లెల్లెడల వజ్రిసమానము లౌచు రాల భీ
కరమలయానిలంబుల యకాలమహత్తరవర్ష మేర్పడెన్. 68

కపోతీకపోతము

దిక్కు మొక్కు లేక దీనాననుం డయి
శీతలానిలంబు భీతి గొలుప
మన్నుమిన్ను లరయఁ గన్నులు గానక
వర్షధారఁ దడిసి వనమునందు. 69

ఉన్నత స్థలంబు నొండొక్కచోఁ గాంచి
ఛత్ర మనఁగఁ దగుకుజంబుఁ గాంచి
మేలు మే లటంచు మేటివలలు దాల్చి
తరువుఁ జేరె బోయ దలను దాయ. 70

ఆవిపినాంతరంబున మహాజలరాసుల మిట్టపల్లముల్
త్రోవలు ముండ్లతుప్పలు సరోవరములగనరాక నిండె వ
ర్షావసరంబు పెల్లయి యరణ్యవిఘాతి మొనర్ప భీకరా
రావము లెల్లెడన్ నెగసె రమ్యవనంబు మహేశభూమిగాన్.71

అటు లొకకొంతకాలము భయంకరవర్షము కుంభవృష్టి గ
ల్గుటయు నిశీథమం దవధిఁ గ్రూరకిరాతుఁడు గాంచెఁ దారలన్
దటతట మానసం బడర దప్పిక యాఁకలి హెచ్చ నంగముం
బటుతరశక్తి బాసె చలిబాధఁ గిరాతుఁడు కొయ్యవారినన్. 72

అటవికి వెడలిన బోయం
డటవీమృగములను దెచ్చునంచును ముదమున్
గుటిలత నుండన్ బోయత
కటకటపడె భర్తరాక కానంబడమిన్. 73

నింగి ముట్టి శేగునీరదంబులఁ గాంచి
భీతిగొలుపు కుంభవృష్టిఁ జూచి
భర్త రాకయుంటఁ బరికించి దిశలెల్ల
బోయకాంత శోకపూర్ణ యయ్యె. 74

"నాథుం డేటికి రాఁ డదేలొకొ! యరణ్యంబందు వేఁటాడ నే
బాధం బొందెనొ క్రూరసత్త్వములచే భాస్వంతుఁ డేఁగన్నభో
వీథిన్ మేఘుము లావరింప నటవీవీథిన్ శ్రమంబొందెనో!
నాథుం డేటికి రాఁడు దైవతమ! మన్నాథుండు నేమంబెగా! 75

భూరిభయోగ్రభోగముల ఫూత్కృతిఁ జేయుభుజంగకోటి వి
స్తారభయంకరార్భటులు సల్పుకరీంద్ర మృగేంద్రకోటి సం
చారముచేయు వింధ్యవనసత్త్వములన్ గొని తె మ్మటంచు నేఁ
గోరఁగనేల ! హా ! పడఁతికోర్కెలు నాథునిప్రాణహానులే! 76

గాటపుటమ్ములన్ వలలఁ గైకొని పోవుట నేఁటిమాటయా !
యాటవికోగ్రసత్త్వముల నార్చుట దెచ్చుట నేఁడు వింతయా !
వేఁటకు నేఁగుటల్ మగిడి వేళకు వచ్చుట నేఁడు క్రొత్తయా !
దాఁటఁగరాదొకో విధివిధానము ! నంపితి నాథు వేఁటకున్. 77

శ్రవణవిదారణం బయి దిశావనితల్ వెఱఁగొందుగర్జనా
రవమున నామిషత్వము పరాభవ మొందుతటిల్లతాలితో
దివమును గప్పి మేఘములు తీవ్రముగాఁ గురియంగ బాధచే
నవయవశక్తిఁ బాసి గహనంబునఁ గూలెనొ? నాథుఁ డక్కటా!78

ఏమి సేయుదాన! నెవరి వేఁడెదుదాన!
బుడుతబిడ్డదాన! బోయదాన!
కాళరాత్రి యయ్యెఁ గాంతుండు రాఁడయ్యె
ననుచు పలువిధాల నడలుచుండె. 79

వింధ్యవిపినమందు విటపివృక్షచ్ఛాయ
నొడలు మఱచి భూమి గొఱఁగె బోయ
క్రూరమృగము లెవ్వి గుర్తెఱింగెనో లేదో
మగిడి రాఁడు దైవమాయ యేమొ? 80

ఆ వటవృక్షరాజమున నంతమహీస్థలి నాక్రమించి విం
ధ్యావని తజ్జయంబు విశదం బొనరింప జటాలిచిహ్నముల్
వేవురు నాట కోటరులు వెల్గ విహంగమకోటి హాయిగా
జీవితకాలముం దగ నిజేచ్ఛగఁ గాఁపుర ముండు భార్యలన్. 81

ఆతరుకోటరంబున సుతాసుతబంధుకళత్రమిత్రులన్
ఆతతభక్తిఁ బ్రేమ వినయాన్వితులై కొలువంగ వేనవేల్
నీతులఁ దెల్పుచున్ హరి వినిర్మలభక్తిని సంస్తుతించుచున్
శాతసుఖంబులన్ గడుఁ బ్రశాంతిగ నుండుఁ గపోతనాథుఁడున్. 82

చిత్రవర్ణకాంతి చెలువొందుటం జేసి
చిత్రకంఠుఁ డనఁ బ్రసిద్ధుఁ డయ్యె
పరమధర్మమూర్తి పాలకుండును గాన
పక్షిరాజటంచుఁ బరగె నతఁడు. 83

శ్రీదవిశుద్ధచక్రిపదసేవితచిత్తుఁడు ధర్మకార్యసం
పాదమహేప్సితార్థుఁడు కృపానిధి భాగవతోత్తముండునై
సాదరపూర్వకార్చనల సాధ్వి సపర్యలు చేయ నిత్యస
మ్మోదముతోడఁగాలమును బుచ్చువిహంగమరాజచంద్రుఁడున్.

ఏల జనించిరొక్కొ విధి నేమని యందుమొ ప్రాణహానినె
క్కాలము భీతిఁ జెందుబలుకానల హీనపతంగజాతిలోఁ
జాల వివేకవంతు లయి సద్గుణశోభితదివ్యదేహులై
సాలవనాంతరంబునను జందనవృక్షముమాడ్కిఁ బుట్టిరే. 85

చందనకల్పకద్రుమవరసాలములన్ ఘనపుష్పజాతిలో
నందము గాఁగ నందనమునందున డెంద మమందనంద మా
నందము నొంద నర్హుల ననాదర మేల యొనర్చె బ్రహ్మ నే
మందుము పుణ్యాదంపతు లహో! తలఁపోయఁగ నీకపోతముల్.

అనుచుఁ గొని యాడుచుండువిహంగకోటి
ప్రేమభక్తిసంయుక్తి ముప్పిరిగొనంగ
దారపుత్రాదులను గూడి ధర్మనియతి
చిత్రకంఠుండు నివసించుఁ జింత లేక. 87

ఆవిహగోత్తమంబు నుదయంబున మేల్కొని నాఁడు భక్తిబ
ద్ధావినయాత్మకుం డయి విధాతను గొల్చి పతంగకోటి సం
భావనచేసి ప్రీతిమెయి భాగ్యయశోనిధి వెంటరాఁగ విం
ధ్యావనిఁ జొచ్చె మేఁతకొఱకై హితబంధు లమాత్యమిత్రులన్.

బారులుదీరి యభ్రమునఁ బాఱుచు శైలనదీ నదంబులన్
సారహిమాంబుపూరజలజాతప్రసూనజలాకరంబులన్
క్రూరమృగేంద్రఖడ్గకపికోకకురంగవనాంతరంబులం
దారసి సంతసంబున విహంగమవారము వ్రాలె నొక్కచో. 89

అంతఁ గిరాతకుండు నచలాంచలభూమి మృగేంద్రుఁగాన క
త్యంతవిషాద మందుచు వనమ్మునఁ గ్రుమ్మరుచుండఁ గాంచి శా
కుంతము లెల్ల పైకెగసెఁ గూయుచు చిందరవందరై వడిన్
స్వాంతము భీతిఁ జెందఁగ నివాసముఁ జొచ్చినవందుఁ గొన్నియున్.

ఆనిశీథమునకు నతివయుఁ బ్రియులును
గోటరములఁ జేరకుండు టెఱిఁగి
విటపిశాఖయందు వీక్షించుచును రాక
విహగపుంగవుండు వెతలఁ గుంది. 9

బంధు లమాత్యమిత్రహితవర్గము దైన్యముఁ జెందఁ బక్షిరా
జేంద్రుఁడు శోక మొంది హృదయేశ్వరి నాత్మఁదలంచి యిట్లనున్
ఎందుల కేఁగెనో! యెచట నేలవిలంబన మెట్లొనర్చెనో!
బంధుగణంబుఁ గూడి ఘనబాధల నొందెనొ! కీడుఁ బొందెనో

ఇల్లును వీడి యెచ్చటికి నేఁగిన దింతయుఁ గాదు; ఒంటరిన్
దొల్లి విలంబనం బెచటఁ దూఁగున దింతయుఁగాదు కాన సఁ
ధిల్లు ప్రమాదము ల్గడచుధీరయుఁ గాదు మదాజ్ఞ వీడి వ
ర్తిల్లెడుబోటిగాదు సుచరిత్ర కులాంగన యెందుఁ జిక్కెనో!!

అమితభయంకరాటవి నివాసము గాఁగను సారధాన్యహా
రముల జలాకరాంబువులఁ ద్రావుచు వేలుపులన్ నుతించుచున్
అమరులవోలె నన్యులఁ దలంచుచు నాపద లొందకుండఁగాఁ
బ్రమదరసాబ్ధిఁ దేల మనపాలిటిదైవము కీడు మూడ్చెనే! 94

పరమపతివ్రతామణియు, భాగ్యయశోనిధి, పుణ్యసాధ్వి, శ్రీ
కరలలితాంగి, సచ్చరిత, కామితదాత్రి, శుభప్రదాత్రి, సుం
దరవదనారవింద, సహచారిణిఁ బాసి భయంకరోగ్రసం
సరణపయోధి దాఁటఁగ వశంబ కుమారులతోడ నా కిఁకన్.95

రెక్కలు రానిపిల్లలు నిరీక్షణ సేయుచు మాతఁ గానమిం
బొక్కుచు మేఁతకై యెగసిపోవఁగ నేరక గూటి నుండనే
నక్కట యేమిసేయుదు మహాపద నొందితి దేవదేవుఁడే
దిక్కిఁక నాకు వేఱగలదే సతిఁ బాసినయాక్షణమ్మునన్. 96

పాయనిభక్తి నీశ్వరునిపాదసరోరుహముల్ భజించు నా
ప్యాయముతోడ నర్థుల కుపాయన మిచ్చు మదీయపత్ని నా
బోయనిపాలుఁ జేసెనోకో!పోకిరివేలుపుఁ బెద్ద నింతగాఁ
జేయఁగ నేమి తప్పిదము చేసె వివేకముఁ బాసె నక్కటా! 97

అసువులఁ బాసెనో!మఱి మహారభసంబున రాకయుండునే
నిసుఁగులు నింట నుండ రజనీతిమిరంబు నభోంతరంబునన్
ముసుఁగులు గప్పెఁ గోటరము భూరిభయంకర మయ్యె భార్యలే
కసువులుమేనఁ దాల్తునె భయంకర మాత్మసతీవియోగమున్.98

కపోతీకపోతము

అనుచు దుఃఖాశ్రుపూరలోచనము మెఱయఁ
గరుణ గద్గదకంపితకంఠ యగుచు
నాత్మహత్య నపేక్షించునాత్మవిభుని
పలుకు లాలించి లాలించి పలికె నిట్లు: 99

ఉత్సాహము:

"విహగరాజ! నీదుకీర్తి విమలమై వెలుంగదే!
ఇహపరంబులందు నీకు నీడుజోడు గల్గునే!
అహహ! నందమొందె డెంద మమృతభాషణములచే
విహగరాజచంద్ర! నీకు వేనవేల్ నమస్కృతుల్. 100

ఖగరాజోత్తమ! నీదుపల్కులు వినంగా వేడ్క నా కయ్యె హర్ష
దగునే జ్ఞానులు ధీరహూరకరుణాదాక్షిణ్యసుస్వాంతులున్
వగపొందన్ బ్రియకామినీసుతులకై బ్రాణంబుల న్వీడఁగా
నగరే యివ్వి ఋణానుబంధములు గావన్ దప్పరా దెవ్వరున్.
పరమవివేకశాలివి కృపారసయోగివి, శంకరార్చనా
పరుఁడవు సాధుసజ్జనసమాజసమాగతకీర్తిగామి వీ
వరయఁగ లోకపూజ్యుఁడవు వాజికులాభరణుండ! దుఃఖముల్
బొరయునెనిన్ను సౌఖ్యములు బొందుటదప్పమహేశుసత్కృపన్.
కామినినై పతంగకులకామికిఁ గామినినై సుతాదులన్
గామితసిద్ధి నంది బహుకార్యకలాపసుకర్మలందునన్
గామినినై సుసౌఖ్యములఁ గ్రాలి మహోన్నతరాజ్యభోగముల్
కామితసంపదల్ పడసి కాలముఁబుచ్చితి నాథ! ధన్యనై. 103

సేమముగాఁ గిరాతువలఁ జిక్కితి బంధు లమాత్యమిత్రులున్
సేమముగాఁగ నీవిటపిఁ జేర్చె కిరాతుఁడు కొయ్యవాత్ర శ్రీ
తామలయానిలంబుల క్షుధాతురతన్ బడియుండె నయ్యయో
యేమని కుందిరొక్కొ గృహిణీమణి బిడ్డలు గేహమందునన్. 104

అనుచుఁ బలికినఁ బ్రియురాలియమృతభాష
ణముల నాలించి ఖగ మాక్షణమ్ములోన
ప్రేయసీముఖాలోకనప్రీతుఁ డగుచు
బంధువులు వెంట రా వ్రాలెఁ బడఁతిచెంత. 105

కన్నదోయినిఁ బుట్టుకన్నీటిమిన్నేరు
వఱదలై పాఱంగ వసుధలోన
హృదయాబ్జమునఁ బుట్టుసదయమరందము
నాప్తులపైఁ జిల్క నార్తిఁ బాప
రసనాబ్ధిఁ బొడముసారసవచనామృత
సారసూక్తులు మేనిశ్రమలు వాప
మానస సురసీమ మనుధీరమేరువు
ధైర్యగంభీరహృదయులఁ జేయ

భర్తఁ గాంచినంత భార్యయు భార్యను
గాంచ భర్తయు బహుకాంక్ష లలరఁ
బరమరాగపారవశ్యులు గాఁగను
గొంతతడవ యుండి కూర్మితోడ. 106

ఖగరాజేంద్రుఁడు ప్రేయసీమణి వినంగాఁ బ్రేమతో నిట్లనున్
"ఖగరాజేశ్వరి! దైవకృత్యము లెఱుంగన్ శక్యమే యేరికిన్?
పగతుం డైనకిరాతు జాలములలో బందీకృతస్వాంతులై
విగతప్రాణులు గాక వాసమునకున్ విచ్చేయుటల్ చోద్యమే.

కరుణాసాగరుఁ డాదయామయుఁడు దుష్కర్మంబులన్ సైచి దు
స్తరకష్టంబులఁ దీర్చినాఁడు శిశుసంతాపంబు నోదార్చినాఁ
డరయన్ నిన్నిట నా కొసంగి యపవర్గానందసౌఖ్యంబులన్
బరమార్థంబు లొసంగినాఁ డతివరో! ప్రార్థింతు నే నీశ్వరున్.

అతివరో! నీసితస్మితముఖాంబుజరోచులు చంద్రచంద్రికా
గతి మతి భ్రాంతిఁ బొంది తమకంబునఁ గ్రోలితిఁ జక్రవాకినై
మతి సెడె నీదుబంధముల మాపెద నిత్తఱి నాగ్రహింపకే
పతులకుఁ బత్నులే పరమభాగ్యము లంచు వచించు నాథునిన్.

కనుఁగొన సమ్మదాశ్రువులు గ్రమ్మ ముఖాబ్జము విస్ఫురింపఁగాఁ
గనుఁగొని కండచక్కెరలఖండములో యనఁ గుల్కుపల్కులన్
"వినుతచరిత్ర! నీవిమలవిస్ఫుటమానస మే నెఱుంగనే
కినుక యదేల నామదిని ఖేచరనాయక! ధర్మరక్షకా!

బంధు లమాత్యమిత్రపరివారము శోకవిభీతచిత్తులై
బంధములందు నొచ్చి బహుబాధల నొందుచు నున్నవారిదే
బంధవిమోచనంబు నెఱపంగ దిగంతయశమ్ముఁ బొందునా
బంధము లల్లె యుంచి ఖగపాలసమాఖ్యయు సార్థకంబుగా. 111

అనునెచ్చెలిహితవాక్యము
విని మెచ్చుచుఁ గొఱికె వలలవిహగాగ్రణి గ్ర
క్కున వాఁడియైనముక్కున
క్షణమాత్రన తంతువులు శకలములు గాఁగన్. 112

బంధముక్తి నొంది బంధు లమాత్యులు
శ్రమలు వాసి మఱచి సకలరుజలు
సంతసంబుతోడ సంకీర్తన లొసంగె
దంపతులకు రాజదంపతులకు. 113

తరణిమయూఖజాలములు తాఁకఁగనే హిమ మెల్లఁ గ్రక్కునన్
గరఁగెడునట్టిరీతిని వికస్వరతావకవక్త్రపద్మపున్
దరిసెనమందినంతటనె నాశముఁగాంచెను దోషజాల మీ
రరయఁగ దివ్యదంపతులు నొదలఁదాల్తుము మిమ్ము నెత్తఱిన్.

పక్షిరాజేంద్ర! మాజాలబంధనములఁ
ద్రెంచి దివ్యయశమ్ము నార్జించినావు
పరమదేవత! కల్యాణి! బంధనములఁ
బాపి సంతోషమగ్న సంపద నొసఁగ[illegible]?'' 115

అనుచు వినయమృదూక్తుల నంజలించి
బంధులు నమాత్యహితు లాడుపలుకుల విని
సంతతానందధైర్యసుస్వాంత యగుచు
నెల్లవారలు వినఁ గాంత యిట్లు పలికె. 116

“పరమోదారచరిత్రులార! మఱిఁ దాపంబొందఁగా నేల! నా
కొఱకై శోకము పొందకుండుఁడు ననున్ క్షుద్రుండు చేపట్టినా
పరమం బాగృహిణీమణీత్వము భువిం బాడయ్యె నా దేహమున్
బరమోదాత్తపరోపకారమునకై బ్రహ్మార్పణం బయ్యెడున్.

పతగకులాగ్రగణ్య! ఖగపాల! మనోహర! ధర్మరక్షకా!
సతతము నీ వెఱుంగుదువు శాస్త్రవిధానసుధర్మముల్ మదిన్
అతిథిసమార్చనారతి మహత్తరపుణ్యఫలం బొసంగు శ్రీ
పతి మది సంతసిల్లు నని పల్కఁగ విందు భవన్మృదూక్తులన్.

శతసంవత్సరదీర్ఘకాలము సతీసాంగత్యసౌఖ్యంబులన్
సుతసందోహసమాత్యభృత్యహితశుశ్రూషల్ దగం బొందుటన్
గతియించుం గద నిష్ప్రయోజనముగాఁ గంసారిఁ గీర్తించుచున్
సతతంబున్ నయమార్గగామి యగుచో జన్మంబు మేలయ్యెడున్.

కాన మదీయబంధనముకై వగఁ దక్కుము నిత్యనిర్మలం
బైన యశోమరీచి సహితార్కర నవోదయవేళ దగ్గఱన్
గానకుఁ జొచ్చె నీపగిదిఁ గైటభమర్దనుఁడో! మహేశుఁడో
నీనయమార్గచింతన వినిర్మలభక్తిఁ బరీక్షఁ జేయఁగా. 120

తడయఁగ నేల! బోయను గదాధరుఁ గా మది నెంచి భక్తి న
మ్రుఁడ వయి ప్రీతిగా నతిథిపూజ యథావిధి నాచరింపు మి
ప్పుడు సురమర్త్యులెల్లరుఁ బ్రమోదపయోధినుయాలలూఁగఁగా
సడలనికీర్తిఁ బొందెదవు సర్వసుపర్వులలోన మిన్నవై.” 121

అన విని యెల్లవారలు మహత్తరదిగ్భ్రమమొంది యుండ నా
ననమున లేఁతన వ్వొలయ "నాతిరో! నాదగుపూర్వపుణ్యమే
ఘన మగుటన్ నినున్ గృహిణి గాఁగ నొసంగె విధాత నాకు ని
వ్వనమున నాతిథేయముల వాగురికున్ దగఁదన్ను టెట్టులో?"

అని చింతించుచున్ననాథుని నమందానందచిత్తంబునన్
గని యాత్మేశ్వరి యిట్లనున్ శ్రవణసౌఖ్యం బిచ్చుసత్సూక్తులన్
"వినవో నాథ! కిరాతుఁ డెంతయుక్షుధావిఖ్యాతనిద్రాభిభుఁడై
ఘనశీతానిలబాధఁ జిక్కె నతిథిం గాపాడఁ గర్తవ్యమౌ. 123

ఖగపతీంద్ర! శుష్కకాష్ఠంబులను దెచ్చి
బోయచెంత నునిచి పొంతపల్లె
కేఁగి యింగలంబు వేగిర గొని తెచ్చి
యగ్నిఁ జేసి యడఁపు మతిథిబాధ." 124

అని చెలి విన్నవింపఁగ విహంగమనాథుఁడు తత్క్షణంబ తా
వ్వసఁ దరుకోటరంబునకుఁబోయి కులాయముఁగూల్చి కాష్ఠముల్
గొని వడిఁ దెచ్చి ప్రోవు నిడి గొబ్బున నీఁగె మహాగ్నిఁ గొంచురాఁ
గను గడుదవ్వునం గలయొకానొకపల్లెకు వేగుజామునన్. 125

పల్లియ కేఁగినఖగపతి
యుల్లము ముదమొందఁ గాంచె నుష్ణాతురుతా
భిల్లుల నెగడుల మండెడు
పుల్లను గ్రహియించి మోము ఫుల్లాబ్జముగాన్. 126

రయమున నేఁగుదెంచి ప్రియురాలిపదంబులచెంత వ్రాలి సం
చయ మగుకాష్ఠసంతతిని జయ్యన నగ్నిని జొన్పి రాజిలన్
రయమున రెక్కలన్ విసరి రమ్యమహోజ్జ్వలకీలికీలలన్
దయ నొనరించె నయ్యతిథి దారుణశీతలబాధ వాయఁగాన్.

ఖగపతీంద్రుఁ డిట్లు కాంతారమున సల్పు
నతిథిసేవఁ గాంచి పతగతతులు
వెఱపు వెఱఁగు గొలుప వెఱ్ఱులై గుసగుసల్
సలుపుచుండి రిట్లు జతలఁ గూడి. 128

వింధ్యకాంతారసీమకు వేఁటకొఱకు
వచ్చి పడియున్నసీబోయవాని ఖగకు
లాంతకు నతిథిగా సేవ లాచరింప
మెడకు నుఱిదెచ్చుకొనుట యేమే లదెట్లు. 129

ఎంతచెప్పిన వినఁడు రాజేంద్రుఁ డేమొ
మోహనాంగిని బంధవిముక్తఁ జేయ
మేనిశ్రమ లెడఁబాసి యిమ్మేలు మఱచి
యెటులు చరియించునో బోయ నెఱుఁగఁదరమె. 130

కాలసర్పంబునోటను బాలుపోసి
ప్రేమతోఁ బెంచినను గాటు వేయకున్నె
పక్షిహంతకు శీతలబాధ నడఁచి
రక్షచేసిన మనకు సంరక్ష యగునె? 131

ఏల యీబోయ సేవలఁ దేలఁ జాగు
పేర్మియసీబంధమోచన పేర్మిఁ జేసి
యిచ్చువచ్చిన చొప్పున కెగసిపోవఁ
గార్య మగు విహగేంద్రపుంగవున కిపుడు. 132

అని ఖగరాజబంధునివహంబు రహస్యములాడుచుండ న
య్యనలుని తాపముల్ మృగయునంగము లెల్లను వెచ్చనొందమే
ల్కని కడుసంభ్రమంబునఁ బ్రకాశమహోగ్రమహాగ్ని కీలల్
గనుఁగొని లేచి యంగములఁ గాచుచు నచ్చెరువొందుచుండఁగా.

చిత్తము పరమార్థంబున
గుత్తము గావించినట్టిగువ్వచెలువ యా
మత్తుం డగుబోయనితో
బత్తిని దగఁ బలికె మనుజభాషల వినఁగాన్. 134

"ఓయినిషాధపుంగవ! మహోగ్రవనం బిది వేటఁజొచ్చిన
న్నీయెడ బంధుసంతతుల నేఁకటఁగా వలఁ బట్టినావు గా
తోయదముల్ మహోగ్రముగఁ దోయము లిచ్చుచునుండ భీతిచే
నీయెడ కేఁగుదెంచితివి యీవటరాజము మానివాసమా. 135

పటుతరవర్షభారము ప్రభంజనుశీతలసీతుబాధలన్
గటువయి మానసం బడరఁ గన్నులు గాననియీనిశీథమం
దిటఁ గొయఁబారి కూలితివి యింగలముం గొనివచ్చి కీలగా
ల్పుటయును దప్తతాపమున లుబ్ధక మేల్కనినాఁడ విప్పుడే.

మనమున శోకవిహ్వలత మానుము నీసకలాంగకమ్ము ల
య్యనలశిఖాకలాపమున నల్లన కాచుము మాగృహంబునం
దనవరతంబుఁ బూజ్యుఁడవు; నాటను సత్రికయు సల్పుచున్న వాఁ
డనఘ ! మదాత్మనాథుఁడు ప్రియంబుననీకు సబంధుకంబుగన్.

కావున మాతప్పిదములు
నేవేనిన్ గలిగి యున్న నిత్తఱి సైఁపం
గావలదె పుణ్యపూరుష
భావంబునఁ గోర్కె దెలుపు ప్రార్థింతు నిదే. 138

నీవే దిక్కుఁక మాకున్
నీవే మాయతిథి వగుదు నీవే గురువున్
నీవే దైవము మాకుం
గావున మాజన్మ సార్థకం బగు ననఘా !" 139

అని యిటు లక్కపోతి హృదయంబు చలింపఁగఁబల్కుపల్కులన్
వినఁగఁ గిరాతకుండు భయవీక్షణసంభ్రమ చిత్తుఁడై యనున్
మన మనుతాప మొందెడు కృపారససాదరసారసూక్తులన్
వినఁగ మదీయమానసము వేదనఁ బొందెడుఁ జాలు నమ్మరో !

అమితభయంకరాటవి మహాపద నొందిననాకుఁ బ్రాణదా
నము దయచేసినట్టి కరుణారసమూర్తులు మీరు పల్కఁగా
నమితభయంబు గల్గెడు ననర్హుఁడనే భవదీయపూజలన్
గ్రమముగఁబొందఁగావిహగకాంత! ననుందయచూడుమిత్తఱిన్.

అనలశిఖాకలాపమున నంగములెల్లను సీతుఁబోసె నే
మ్మనమున భీతి దక్కి మఱుమాటలు పల్కఁగ నూపిరాడకే
కనకనలాడునాకడుపు గ్రన్నన నాక్షుధ దీర్చి కాచి వే
ఘనతరపుణ్యాసంపదలఁ గాంచుము పావని! నానమస్కృతుల్."

అను నావ్యాధునిక్రూరమానసునిఁ బాపాత్ము న్విలోకించి యా
తనిప్రాథేయవిధేయవాక్యముల మోదం బొప్ప నాలించినం
తన భీతిన్ మది దక్కి యాపతగసంఘుం బెల్ల నుండన్ బ్రియం
బున నాత్మేశ్వరి కిట్లనున్ ఖగకులాంభోధీశుఁ డుత్కంఠతోన్.

"తరుణిరో! నాకు నీయతిథిఁ దన్పుమపాయము దోఁచదయ్యె ని
వ్వరవనభూమియందు మనవాసము నింటను నొంటిగింజలే
దరయఁగఁ బూఁటపూఁటకు వనంబునఁ గల్గినదానిఁ దించు నీ
శ్వరుకృపఁ బ్రాణముల్ గలిగి సాధుమహాత్ములపోల్కి నుండఁగా.

ధనమాశూన్యము;ధాన్యమాకొఱఁత;సత్కారంబులాసున్న; మా
జననంబంటివ హీనపక్షికులమున్; సద్భక్తియం చన్నచో
మనసుం జంచలమైన;దిత్తఱి క్షుధాభారంబుఁ బాపంగ నీ
వనమధ్యంబున నాతిథేయములసల్పన్ వేగ నూహింపవే!"145

అనుటయు నాఖగేంద్రునకు నాగృహిణీమణి ధైర్యచిత్తయై
యను"ఖగరాజ! నీపలుకు లన్నియు సత్యములైన నియ్యెడన్
దనుపునఁ దోఁపకుండునె విధాతకృపార్హుల కెప్డు సంతసం
బొనరుచు; మచ్ఛరీరమును నొడ్డియె వీనిక్షుధార్తిఁ బాపుమున్.

చెచ్చెఱ నాబంధంబుల
విచ్ఛేదనఁ జేయు మిపుడు విహగపతీంద్రా !
చొచ్చెద నగ్నిజ్వాలల
మెచ్చఁగ దేవేంద్రుఁ డాదిమేటియమర్త్యుల్." 147

ఆపలుకు ల్వెస న్వినినయంతన బంధు లమాత్యులెల్ల సం
తాపముఁ బొంది చేష్టలును దక్కి తదేకవిలోకనంబులన్
బాపవిదూరు వాజిపతిభావిఁ దలంచుచుఁ గుందుచుండ సం
తాపవిహీనచిత్తుఁడు పతంగవిభుండు పతంగి కిట్లనున్. 148

"ఇంతిరో ! యాతిథేయముల నింపు జనింప దనింపఁ జేయ నే
కాంతలు నీకు సాటి సురకాంతలనైనను గానవత్తురే
జింతను వీడు మియ్యతిథిసేవ లొనర్ప క్షుధార్తిఁ బాపఁగా
నింతుల కెందు దేహముల నిచ్చుట చెల్లునె నాథుఁ డుండఁగా.

మనమున శంక వాసె హితమైనయమాత్యసుతాదులందుఁ, బా
లనమున రాజ్యభోగముల లౌకికకార్యకలాపమందు నా
మనమున ప్రేమకామములుఁ బాసె వినిర్మలమైనదీక్షణం
బునఁదగ నాశరీరమున బోయనియాఁకలిఁ దీర్తు భక్తితోన్."

అనుచు వైరాగ్యధైర్యభక్త్యాత్మఁ దగుచు
నీశ్వరారాధనల సల్పు నిచ్చగించు
ప్రాణనాథుని వీక్షించి బదులుపలికె
పక్షియిల్లాలు ధర్మసంపన్నురాలు. 151

"పరమదయానిధీ! పతగపాల ! మనోహర! నాదుపల్కు లీ
వరమర లేక సారయు, వివాదము గాదిది, మీఁదునాజ్ఞ కె
వ్వరు నెను రాదువారు హితవాదిని మీప్రియదాసిఁ గాననా
వరముల నీయ నియ్యెడ నవశ్యము మీ దగుకార్య మెన్నఁడున్.

తమయాజ్ఞన్ శిరసావహించుచు సదా ధర్మంబు పాటింపుచున్
దమపాదంబులపూజ సల్పుచు మదిన్ ధ్యానించుచున్ శ్రీహరిన్
అమితానందతరంగడోలికల సౌఖ్యాబ్ధిన్ యథేచ్ఛంబుగాఁ
బ్రమదం బొప్పఁగఁ దేలునామదికిఁ దాపం బిడ్డు చేకూర్తురే.

పతగరాజేంద్ర! మీపాదంబులను బట్టి
ప్రార్థింతుఁ దెగువను మానుఁ డిపుడు
అతిథి కాహారంబ నగుదు నాబంధమో
చన చేయ నెమ్మది సంతసిల్లు
పసుపుఁగుంకుమ లిడి పనుపుమా! సురలోక
సౌఖ్యముల్ గలుగు విశ్రాంతి గలుగు
ఏ మిమ్ముఁ బాసిన నిసుమంత యేనియుఁ
గొఱఁత గల్గదు మీకు ధరణియందు

పతిసి బాసి ధరణి వైధవ్యమును బొందఁ
బడఁతు లోర్వఁగలరె పడరె నింద
సతుల కేడ్గడయును బతులె యటంచును
వినరె! తలఁపరె! ధర విహగరాజ! 154

సతివిహీన లైనపతులు వివాహార్హు
లనునయోక్తి ధర్మమగును గాదె!
పతులఁ బాయుసతులు పరిణయమాడుట
లోకగర్హితంబు గాకయున్నె. 155

కాంత నొక్కతె నిల్లాలిఁగా గ్రహింప
నర్హులే మీరు గాన నట్లాచరించి
కాఁపురం బుండుఁ డింక సౌఖ్యంబు మీఱ
బంధుమిత్రు లమాత్యులు భక్తిఁ గొలువ.'' 156

అనుచు నిజశరీర మర్పింప నతిథికిఁ
జింతఁ దక్కి పలుకునింతిఁ గాంచి
పతగపుంగవుండు పరమధర్మాత్ముండు
పలికె నిట్లు ధీరభాషణముల. 157

"ఇంతిరో! నీవు పల్కిన దదెల్ల యథార్థము నీసతీత్వ మ
త్యంతపవిత్రమై త్రిభువనాంతరముల్ వెలుఁగొందుఁగాక ప్రా
ణాంతమునందు నీకుఁ ద్రిదశాలయవాసము గల్గు డెందముల్
జింతను వీడు మియ్యతిథిసేవ యొనర్చెద మాఱువల్కకే. 158

ఆలుబిడ్డలపయి నమితభోగములందు
రాజ్యమందు బంధురాజియందు
మనసు నిలుపలేను మాలిన్యరహితమౌ
నతిథిపూజఁ దప్ప నితరమందు. 159

ఇంద్రచంద్రదినేంద్రు లీశ్వరాదులు సాక్షి
యుద్వాహమైతి నిన్నో లతాంగి !
కమనీయముగ బహుకాసారకాంతార
ములఁ గేళిసల్పితి జలరుహాక్షి !
వంశవర్ధనుల దేవాంశసంభూతులౌ
సుతులఁ బొందితి నహో శోభనాంగి !
దానంబు ధర్మంబు దయను దప్పక రాజ్య
పాలనఁ జేసితి భాగ్యలక్ష్మి !

ఇన్నిటికి మూలకారణం బీవ కావె
పరమకల్యాణి ! నాపాలిభాగ్య మీవె
నిన్ను విడనాడుచుంటి నోసన్నుతాంగి !
అందుకో దేవి ! ప్రణయపుష్పాంజలులను." 160

అనుచు సమ్మోదపడఁతి నోదార్చి కంటఁ
దొరఁగుప్రేమాంబుపూరముల్ తుడిచివైచి
పక్షిరాజేంద్రుఁ డిట్లను బంధుమిత్ర
మంత్రిహితు లెల్ల వినఁగ సమ్మదము గలుగ. 161

"పతగవరేణ్యులార ! పరిపాలకకృత్యసుతీర్ణులార ! సం
తతనయమార్గదర్శకవిధానధురంధరులార ! నానమ
స్కృతులు తదీయసేవకు విశుద్ధమనస్కుఁడనైతి మీఁదు సం
గతి ఘనమోక్షరాజ్యములు గల్గెఁ గృతార్థుఁడనైతి మీదయన్.

కాలము చెల్లినన్ బుడమిఁ గాలిడఁ జెల్లద యేరికైన పోఁ
గాలము దాఁపురించుఁ గలకాలము జీవిత ముండఁబోదుగా
గాలము మ్రింగుమీనుగతిఁ గాలకిరాతునితీవ్రవాగురం
గాలముసేయ తథ్యము జగంబునఁ బుట్టినజీవకోటికిన్. 163

కాన మదాత్మనాశమునకై వగపొందక భీతిదక్కి యీ
శాను నిరంతరార్చనల సల్పుచు భక్తి దయార్ద్రచిత్తమున్
మానవసేవలన్ మదిని మాధవసేవలటంచు నెంచి స
న్మానముఁ బొంది పెద్దలను మన్ననచేయుఁడు ధర్మపద్ధతిన్.164

వంశవర్ధనులఁ జిఱుతప్రాయముగల
యనుఁగుబిడ్డలఁ గాపాడ నర్హభంగిఁ
బ్రతిన చేయుఁడు మీరేను బరమప్రీతి
సంతసిల్లెదఁ బొందెద స్వర్గసుఖము.'' 165

అనుచు ఖగముల నోదార్ప వినతు లగుచుఁ
బ్రతిన సల్పిరి వారెల్లఁ బరమభక్తిః;
అంత ఖగపతి ముదితసుస్వాంతుఁ డగుచుఁ
బశుపతినిగూర్చి ప్రార్థించె భక్తి నిట్లు : 166

“ఎవ్వఁడు నెల్లలోకముల నేల సృజించునో, పెంపుచేయునో,
ఎవ్వఁడు రూపుమాపునో,మఱెవ్వఁడు నిత్యమొ ! యెల్లలోకమం
దెవ్వఁడు పూజనీయుఁడో, సురేశ్వరు లెవ్వనియాజ్ఞ దాఁటరో
అవ్వనజాయతాక్షుఁ బ్రమదాధిపుఁ గొల్తు మదిష్టసిద్ధికై. 167

కవిరాజవిరాజితము :—

జయజయ ! శంకర శూలి మహేశ్వర సాంద్రయశస్కర నీలగళా!
జయజయ! భీషణఫూత్కృతి పన్నగజాలమహోజ్జ్వలహారహరా!
జయజయ ! భీకరదానవమర్దన సర్వసుపర్వసుశాంతికరా !
జయజయ! వాసవనారదవందిత ! జయగురుదేవపరాత్పర జై!"

అనుచు బ్రిస్తుతించి యగ్ని రాజిలఁ జేసి
అతిథిఁ జుట్టి దిరిగి యగ్నిఁ దిరిగి
యచటివార లెల్ల నచ్చెరువొందఁగఁ
బతగుఁ డిట్లు వలుకు నతిథితోడ. 169

"అతిథివరేణ్యా ! నాయెడల నాగ్రహ మందకు జాగుచేసితిన్
అతిథిసపర్యచేయ వినతాంగుఁడ నే భవదీయుఁడన్ దయా
మతివయి నాసపర్యల సమంచితిరీతి గ్రహించి పొమ్ము నా
సతియును బంధులున్ హితులు సంతసమందఁగలారు దీనికిన్.

కనకనలాడి ప్రజ్వరిలుగాఢతరాగ్నిశిఖాకలాపమున్
జొనిపెద నాశరీరమును సోదర ! యూమిషహారభక్షణం
బున నిట నీక్షుధాతురత పూర్తిగఁబాసి శ్రమంబువాయు మే
నును బహుపుణ్యలోకము లనూనతఁగాంచెద నాత్మతృప్తిగన్."

అనుచుఁ గపోతరాజము రయంబునఁ బావకఘోరకీలలన్
మునుఁగుటయున్ గిరాతకుఁడు మూకవిధంబున మాటలేక చే
తన నశియింప; బ్రమాన్పడఁ బతంగసమూహము; ఘోరదుఃఖవే
దన వివశాత్మయై యడరి, తన్వీపతంగి కిరాతుతో ననున్. 172

"అమలము మాదుభక్తి వినయంబును శోధనఁజేయ బోయరూ
పమున నికేఁగుదెంచితివి పాపవినాశన! దేవదేవ! కా
వుమునిజరూపుఁ జూపుము ప్రభూ! దయచూడుమునీవుబోయవే!
కమలజుఁ గన్నతండ్రివో! నగాధిపనందనభర్త వాడువో! 173

పతగకులాధినాథుఁడు కృపారసమోదపరీతచిత్తుఁ డు
న్నతగుణకీర్తికాముఁడు సనాతనధర్మపరుండు దేవతా
తతి మదిఁ గొల్చుభక్తుఁడు విధాతనియోగమునన్ మహాత్మ! నీ
వతిథిగ రాఁగ మన్ననల నర్చనసేసె విశిష్టభక్తితోన్. 174

ఎన్నఁటికైన దేహము నశించుట తప్పదు ప్రాణికోటి కే
బన్నములందుటో రుజలఁ బొల్పుటో రిపుచేతఁ జిక్కుటో
గన్నుల మాయఁగావలయుఁ గాన వినీతిఁబరోపకారివై
సన్నుతుఁ డాఖగేశ్వరుఁడు సత్కృతి నీకు నొసంగె దేహమున్.

ఓయతిథిప్రభూ! ఖగకులోత్తముఁ డారయ ధన్యుఁడయ్యె నీ
వీయెడ నివ్విఁ అంగొనఁగ నేల ప్రమోదవిభీతచిత్తతన్
మాయతిథిక్రియల్ గొనుము మాన్పుము నీక్షుధ నీప్రమోదమే
యీయెడ మాప్రమోదము గ్రహింపుము మాంసము పక్వమ
య్యెడున్."

అనుచుఁ గపోతి నేత్రముల నశ్రుజలంబులురాల గద్గద
స్వనముల మోము వెల్లనయి సంభ్రమధైర్యవిరాగచిత్తయై
యనునయవాక్యముల్ బలుకునంతఁ గిరాతుఁ డదేమిచిత్రమో
మనమున నేమిదోఁచినదొ మాన్యత నిట్లను నాకపోతికిన్. 177

మనసు చలింప; గద్గదిక మాటలు దొట్రువడన్; భయంబునన్
వణఁకుచు; లేచి హస్తము లవారితభక్తి ఘటించి యాదలన్
వనరుచు తెప్పపాటిడక వాజికులాంగనఁ గాంచి "యమ్మరో!
యనయము రక్షసేయవె! మహాత్ముల మిమ్ముల నేఁడు గంటిఁగా.

ఏ నొకమానవాధముఁడ నే మృగయుండను గ్రూరచిత్తుఁడన్
హీనకులప్రభూతమతిహీనుఁడఁ జంచలచిత్తుఁడన్ గృపా
హీనుఁడ సాధుజీవులకు హింస లొనర్చెడివాఁడఁ గాని యో
మానిని! కాదు మీదయినభక్తిపరీక్షకు వచ్చు దేవతన్. 179

తలఁపఁగ మీరు పక్షులరె! దైవవిధిన్ భువిఁ బుట్టినట్టివే
ల్పులో! నయధర్మమార్గములబోధముఁ జేయవిహంగరూపముల్
గలిగినమానిశ్రేష్ఠులరో! గాక మఱెవ్వరు గారు మిమ్ములన్
దలఁచినఁ బాపముల్ దొరఁగుధన్యుఁడనైతిని మిమ్ముఁ గాంచుటన్

ప్రబలభీకరవింధ్యవనమధ్యమందునఁ
బడియున్న నన్నుఁ గాపాడినారు
భీకరానలశిఖల్ బ్రీతిగాఁ దరికొల్పి
ఘనసీతుబాధలఁ గాచినారు
సహజశత్రువునైన నచపలునిఁ గరుణించి
దేవత వంచుఁ గీర్తించినారు
మండుటాఁకలిబాధ మెండయి హారంబు
నిం డన దేహంబు లిచ్చినారు

అహహా! మిముఁ బోలుపుణ్యు లీయవనిఁ గలరె
పక్షిమాత్రులె దివ్యదంపతులు మీఁరు
ధన్యుఁడను నేను మీదివ్యదర్శనమున
నాదుపాపంబులెల్ల వినాశమొందె. 181

అరయఁగఁబుణ్యశాలి కరుణాగుణధాముఁడు దేవతార్చనా
పరుఁడు వివేకవంతుఁడు కృపారసమానసుఁ డాఖగేంద్రుఁ డి
త్తఱిఁ దనదేహమిచ్చెనె యుదారచరిత్రుఁడు నిట్టిపాతకుం
చెఱుఁగ వివేకహీనుఁడ ఖగేశ్వరి! నామొఱ యాలకింపవే! 182

అజ్ఞానిని బాపాత్ముఁడ
విజ్ఞానిని నెట్టిలోదు వేఁ దెల్పఁగదే
సుజ్ఞానీ! నిను వేఁడెద
నజ్ఞానము సైఁచి కావు మంజలు లివిగో!" 183

అనుచుఁ గిరాతకుండు ప్రబలాశ్రుకణంబులు రాలఁ దుచ్ఛజీ
వనమున రోఁతపుట్టి ఖగభామిని బంధవిముక్తఁ జేసి బం
ధనము ల బాణతూణముల దబ్బున నగ్నిని వైచి మోహముల్
మనమున మాపి యొప్పెసఁగె మౌనివరేణ్యునిఠీవిఁబోల్చుచున్.

అంతఁ గపోతి బోయనిమనఃపరివర్తన మెల్లఁ గాంచి య
త్యంతదయాంతరంగ యయి యాతని కిట్లను"నోకిరాతకా!
చింతిలనేల!యీశ్వరునిఁ జింత యొనర్పు మకల్మషుండవై
యింతిని గూడి పొందుము మహేశ్వరలోకనివాససౌఖ్యముల్."

అనుచు హితోపదేశము ప్రియంబున వారల కెల్లఁ జేసి నం
దనులను బుజ్జగించుచుఁ బతంగహితావలి చేతఁబెట్టియి
ట్లను "ప్రియబంధులార! పతగాధిపురాజ్ఞ వహింతు రేగదా!
మనమునఁ జింతదక్కుఁడు నమస్కృతులియ్యవె నాథుఁజేరెదన్.

అతిథిపుంగవ! సహాగమనంబు సలుపు
నను వు చేకూరె నరుణోదయంబు నయ్యెఁ
బుణ్యకాలంబుఁ బ్రాప్తించెఁ బోదు దివికి
సెల వొసంగుము యనుచు నన్నెలఁత యంత. 187

తనపతిని దలఁచి యనలము
ననువుగ దరికొల్పి కొంచు నద్భుతముగఁ జొ
చ్చెను జ్వాలల ఖగముల నె
మ్మనములు నెఱియంగఁ బోయమానస మడలన్. 188

రత్నకాంచనమయదివ్యరథమునందు
దేవతాతతి కొలువ దేదీప్యమాన
వివిధభూషణభూషితు విభునిఁ గాంచి
స్వర్గమందెఁ గపోతియు సంతసమున. 189

పక్షిదంపతు లీరీతిఁ బరమహర్ష
మున దివిజసేవలు గొనుచుఁ బోవునపుడు
పుణ్యవర్తనుఁ డగుట నాబోయ గాంచి
వారిఁ బ్రార్థించె నిట్టు లవార్యభక్తి. 190

"పావనులార! సంతతశుభవ్రతకార్యకలాపకర్తలా
రా! వరకీర్తిపుణ్యముల రాజిలుదంపతులార! దీనునిన్
గావరె! మానవాధమునిఁ గావరె! మీశరణార్థిఁ బ్రోవరే!
పోవఁగఁజెల్లునే విపినభూమి ననున్ దిగనాడి మీ కిటన్". 191

అనుచు భక్తిసంయుక్తుఁడై యంజలించి
రయముగా నేఁగుదేవతారథముఁ జూడ
విపినమార్గంబుఁ బట్టి వేవేగఁ జనుచుఁ
బోయె బోయండు రథముకన్మొఱఁగుదనుక. 192

అంత బోయండు చేయున దింతలేక
యెల్లశోకంబు దిగమ్రింగి యిల్లుచేరఁ
గడచిపోసాఁగె నవ్వింధ్యకాననమున
ధైర్యసుస్వాంతుఁడై మదిఁ దలఁచు నిటులు: 193

"ఔరా! యెంతటిచింతఁ గంటి మృగయావ్యాపారలోలుండనై
ఘోరారణ్యముఁజొచ్చి; యెందయినఁబుల్గుల్ సేవలుంజేయుటన్
క్రూరాగ్నింబడి చచ్చుటన్ గలదె వాక్రువ్వన్ నిజంబందురో
కారో! పంకజగర్భమాయల నెఱుంగన్ శక్యమే యేరికిన్.

అరయఁగ జన్మచేనరుఁడనై నను దుర్విధి నీతిబాహ్యతన్
వఱలితి నెంచిచూడ నొకవర్తనమేరియు సత్యరక్షలే
దరయఁగఁ బక్షిదైవతము ధర్మము నీతియు మోక్షవాప్తి కా
కర మగువిద్యయున్ దెలిపి కర్మవిపక్వముఁ జేసితే కదా"! 194

అని చింతించుచు బోయ వేగమున సాంద్రారణ్యమున్ దాఁటి శై
తనగంబుల్ జలజాకరంబులు సుమక్షేత్రంబులం దాఁటి విం
ధ్యనగోర్విన్ దనపల్లెకుం జనియె భార్యాబంధుమిత్రాదికం
బును దన్ జేరి సమాగమంబునకు బ్రహ్మానందముం బొందఁగాన్.

పెన్నిధి గన్న పేదవిధిఁ బిన్నలు పెద్దలు నూఱివారలున్
మన్ననఁ జేయ బోయ నయమార్గమునన్ గుశలంబుచేసి తాఁ
గన్నది పూసగ్రుచ్చువిధిగా వినిపించి విసంభ్రమానసం
పన్నవిషాదమోదయుతమానసులం దగఁ జేసె వారలన్. 196

సుగుణుఁ డగుబోయ కలరవ
ఖగపతిచరితంబుఁ దెలిపి కలుషం బుడుగన్
భగవానుని గీర్తించుచుఁ
దగ నిట్లను బోయవాండ్రు తాపం బొందన్. 197

"మానవజన్మ మొంది యవమాన మెఱుంగక జీవహింసలన్
మానక పాపముం బొరయఁ బాడియె మానవహీనులార! మీ
మానవజన్మమున్ దలఁచి మంగళకార్యము లాచరించి యీ
శాను నిరంతరార్చనల శాశ్వతసౌఖ్యము బొందుఁడీ దివిన్." 198

అనుచు ననేకధర్మముల నాడి కిరాతుఁ డుదగ్రవేదనన్
వనరుచు శాంతిఁ గాంచి మదమత్సరమున్ విడనాడి మానసం
బున నిహలోకవృత్తమున మోహము వీడి ప్రశాంతి నందఁగా
ఘనమగుభక్తియోగమునఁ గాలముఁ బుచ్చెను నిశ్చితాత్ముఁడై.

సతిని సుతుల వీడి సర్వబంధుల వీడి
పుణ్యావర్తనుండు బోయఁ డపుడు
వింధ్యనగముఁ జేరి విశ్వేశ్వరునిగూర్చి
తపముఁ జేయఁజొచ్చె ధర్మయుక్తి. 200

అటులు కిరాతుఁడున్ దబిసియై బహుకాలము వింధ్యమందునన్
జటులతపస్సు సల్పి యవసానమునం దపవర్గమొందె నం
చిటులు త్రికాలవేత్తలు వచింపఁగ వింటిని ధర్మనందనా!
పటువగుపాపముల్ దొలఁగవా పరమేశ్వరు బుద్ధినిల్పినన్. 201

అనుచున్ సంతసమొప్ప భీష్ముఁడు కపోతాఖ్యానముం జెప్పి యి
"ట్లను నాధర్మకుమారుతోడ నెవ రీయాఖ్యానమున్ శ్రద్ధతో
వినినన్ భక్తిఁబఠించినన్ గలుషముల్ విచ్ఛిన్నమౌ నంతనే
ఘనలక్ష్మీవిభవాతిరేకమున సౌఖ్యం బుందు రెక్కాలమున్."

అని కథకుండు సాంతముగ నక్కథఁ దెల్ప రసోత్కరంబుగా
వినియె యుధిష్ఠిరుం డతిపవిత్రుఁడు భక్తి నమస్కరించుచున్
దననయుధర్మసంతతి కుదాహరణంబుగ నుత్తరంబు గ
ల్గిన దని సంస్తుతించుచు "భళీ" యని మెచ్చిహృదంతరంబునన్.

శ్రీ శ్రీ శ్రీ

ప్రతులకు :

శ్రీ బులుసు వేంకటేశ్వరులుగారు, బి. ఏ.

రామారావుపేట,

కాకినాడ,

అని వ్రాయునది.